సాక్షి జగిత్యాల

బుధవారం । 3 । మే । 2023



వైభవంగా వసంతోత్సవం

ధర్మపురి : నృసింహుని నవరాత్రోత్సవాల సందర్భంగా ఏడోరోజు మంగళవారం స్వామివారికి వసంతోత్సవం నిర్వహించారు.



వేసవి శిక్షణ శిబిరాలపై ఆసక్తి

జగిత్యాల: 'సాక్షి' చేపట్టిన వేసవి శిక్షణ శిబిరాలపై విద్యార్థులు అత్యంత ఆసక్తి చూపుతున్నారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
32.0/23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉండి, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

31వరకు పోలీస్‌యాక్ట్

జగిత్యాలక్రైం: జిల్లాలో బుధవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ భాస్కర్ తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలీస్‌యాక్ట్ అమలులో ఉన్నందున ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు నిర్వహించరాదని సూచించారు. అత్యవసరమైతే పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలని ఎస్పీ కోరారు. శాంతిభద్రతల పరిరక్షణకు అన్నివర్గాలు సహకరించాలని అన్నారు.

త్వరలో మక్కల కొనుగోళ్లు



దివ్యభారతి

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): రైతులు పండించిన మక్కలను కొనుగోలు చేసేందుకు జిల్లావ్యాప్తంగా పది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మార్క్‌ఫెడ్ డీఎం దివ్యభారతి తెలిపారు. మంగళవారం మండలకేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. జగిత్యాల, ఇబ్రహీంపట్నం, కోరుట్ల, మల్లాపూర్, కథలాపూర్, మేడిపెల్లి, ధర్మపురి, బీర్‌పూర్, రాయికల్‌లో మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, త్వరలోనే వాటిని ప్రారంభిస్తామని తెలిపారు. రైతులు మక్కలను కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని ఆమె సూచించారు. వెంట ఆధార్‌కార్డు, పట్టాదార్ పాస్‌పుస్తకం, బ్యాంక్ ఖాతా జిరాక్స్‌లు తీసుకు రావాలని కోరారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం



ధాన్యం పరిశీలిస్తున్న లక్ష్మీనారాయణ

జగిత్యాలరూరల్: రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి లక్ష్మీనారాయణ ఆదేశించారు. జగిత్యాల రూరల్ మండలం అనంతారం, లక్ష్మీపూర్, అర్బన్ మండలం గోపాల్‌రావుపేట, తిప్పన్నపేటలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తేమశాతం వచ్చిన వడ్లను వెంటనే తూకం వేయాలన్నారు. వాతావరణ పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని, నిర్వాహకులు అప్రమత్తం కావాలని సూచించారు. జిల్లాలోని 18 మండలాల్లో సెర్ప్ ఆధ్వర్యంలో 145 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇందులో 60 కేంద్రాల ద్వారా ఇప్పటికే 4,500 క్వింటాళ్ల ధాన్యం సేకరించామని చెప్పారు. డీపీఎం వెంకటేశ్, ఏపీఎం గంగాధర్, సర్పంచులు జలేందర్, జయ, జాన్ పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్ పరీక్ష రద్దు



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

జగిత్యాల: ఓపెన్ ఇంటర్ పరీక్షల్లో మంగళవారం గందరగోళం నెలకొంది. తెలుగు మీడియం అభ్యర్థులకు ఇంగ్లిష్ మీడియం ప్రశ్నపత్రాలు రావడంతో కంగుతిన్నారు. చివరిరోజు ఎకనామిక్స్ పరీక్ష జరగాల్సి ఉంది. విద్యార్థులు పరీక్ష హాల్‌లో పరీక్ష రాసేందుకు సిద్ధమయ్యారు. ఇన్విజిలేటర్లు వారికి ప్రశ్నపత్రాలు అందించారు. అయితే, అవి ఇంగ్లిష్ మీడియం ప్రశ్నపత్రాలు కావడంతో విద్యార్థులకు ఏమీ అర్థంకాక విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి సూచన మేరకు.. ఈనెల 13న ఎకనామిక్స్ పరీక్ష నిర్వహిస్తామని విద్యార్థులకు చెప్పి పరీక్షహాల్ నుంచి బయటకు పంపించివేశారు.

జీవిత పాఠాలు నేర్చుకోవాలి

జగిత్యాల: విద్యార్థులు జీవిత పాఠాలు నేర్చుకోవాలని అదనపు కలెక్టర్ మకరంద్ సూచించారు. స్థానిక ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో గ్రూప్స్ టాపర్స్‌కు కాసుగంటి నారాయణరావు స్మారక క్యాష్ అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రూప్ టాపర్స్ నాగరాజు, సుష్మిత, ఇస్మాయిల్, మానస, విజయ రూ.40 వేల చొప్పన అదనపు కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అశోక్, వైస్ ప్రిన్సిపాల్ కరుణాకర్, ఎన్‌సీసీ కేర్ టేకర్ ఎలిజబెత్ రాణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు వర్షసూచన

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో రాబోయే ఐదు రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉందని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం డైరెక్టర్ శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఈనెల 3న ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. ఈదురుగాలులు గంటకు 30 కి.మీ. నుంచి 40 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు.

పేదల బియ్యం పక్కదారి

రేషన్.. రీసైక్లింగ్!

- రైస్‌మిల్లుల్లో మరపట్టి సన్నబియ్యంగా మార్పు
- బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయం
- సొమ్ము చేసుకుంటున్న బడా వ్యాపారులు
- అక్రమార్కులపై చర్యలకు అధికారుల యత్నాలు
- అడ్డుకునేందుకు రాజకీయ నాయకుల ఒత్తిళ్లు

- ఏప్రిల్ 26న జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామ శివారులోని రైస్‌మిల్లులో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. అనుమానాస్పదంగా కనిపించిన సుమారు 25 క్వింటాళ్ల బియ్యం సీజ్ చేశారు.



కల్లెడ రైస్‌మిల్లులో తనిఖీ చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు(ఫైల్)

జగిత్యాలరూరల్: పేదల బియ్యం పక్కదారి పడుతోంది. ప్రధానంగా కొందరు రైస్‌మిల్లర్లు దళారులను నియమించుకుని రేషన్ బియ్యం కొనుగోలు చేస్తూ రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. అక్కడ ఆ బియ్యాన్ని మళ్లీ మరపట్టి(పాలిష్ చేసి) సన్నబియ్యంగా మార్చి బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దందాను అరికట్టేందుకు పోలీసులు, పౌర సరఫరాలు, చివరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నా.. రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో ముందుకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

లబ్ధిదారుల నుంచి కొనుగోలు..

గ్రామాలు, పట్టణాల్లో ప్రతినెలా ఒకటో తేదీనుంచి 15వ తేదీ వరకు రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు. దళారులు ఆటోలు, ద్విచక్ర వాహనాలపై వారివద్దకు నేరుగా వెళ్లి కిలో ధర రూ.10చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ఇలా కొనుగోలుచేసిన బియ్యాన్ని కొందరు రైస్‌మిల్లర్లకు విక్రయిస్తున్నారు. మిల్లర్లు ఆ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి కొంత ఎఫ్‌సీఐకి సీఎమ్మార్ కింద అందిస్తున్నారు. మరికొందరు సన్నబియ్యం పేరిట బహిరంగ మార్కెట్‌కు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇంకొందరు నూకలుగా చేసి విక్రయిస్తున్నారు. ఇంకొందరు గుట్టుచప్పుడు కాకుండా ఇతర రాష్ట్రాలకు తరలించి అధిక ధరలతో విక్రయించి చేతినిండా సంపాదిస్తున్నారు.

అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు..

- జిల్లాలోని రైస్‌మిల్లర్లకు కేటాయించిన ధాన్యం నిల్వలపై వివరాలు సేకరించేందుకు ఉన్నతాధికారులు తనిఖీలు చేస్తుండగా.. వాటిని అడ్డుకునేందుకు రైస్‌మిల్లర్లు రాజకీయ నాయకులను ఆశ్రయిస్తున్నారు. వారితో అధికారులపై ఒత్తిళ్లు తీసుకొచ్చి తనిఖీలకు అడుగడుగునా అడ్డుపడుతున్నారు. ఫలితంగా అధికారులు అక్రమాలను అరికట్టడంలో సత్ఫలితాలు సాధించలేకపోతున్నారు.
- జగిత్యాల పట్టణ శివారులోని అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు పెద్ద ఎత్తున రేషన్ బియ్యం కొనుగోలు చేసి.. మళ్లీ మర ఆడించి సన్నబియ్యంగా మార్చి అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు.
- జిల్లాలోని మల్యాల మండలం రాజారం శివారు, సారంగాపూర్ మండలం పెంబట్ల కోనాపూర్ శివారు, దుబ్బరాజన్నస్వామి ఆలయ సమీపంలోనూ పెద్దఎత్తున రేషన్ బియ్యం నిల్వలు చేస్తున్నారు.
- రాత్రి సమయాల్లో ఎవరికీ కనిపించకుండా లారీల్లో లోడ్‌చేస్తూ ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

నిఘా పటిష్టం చేశాం



జిల్లాలోని పేదలకు చెందాల్సిన రేషన్ బియ్యం బహిరంగ మార్కెట్‌కు తరలివెళ్తోంది. మాకు సమాచారం అందడంతో తనిఖీలు చేసి నిందితులపై కేసులు నమోదు చేస్తున్నాం. వాహనాలను సీజ్ చేస్తున్నాం. రేషన్ బియ్యం అక్రమ రవాణా కట్టడికి 6ఏ కేసులు నమోదు చేశాం. జిల్లా వ్యాప్తంగా నిఘా పటిష్టం చేశాం.

– రజనీకాంత్, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్

పోలీసులు నమోదు చేసిన కేసులు

సంవత్సరం	నిందితులు	నమోదైన కేసులు	సీజ్‌చేసిన బియ్యం విలువ (రూ.లలో)
2021	295	207	32,65,050
2022	213	122	60,20,220
2023	17	10	2,85,900

పౌర సరఫరాల శాఖ..

సంవత్సరం	నమోదైన కేసులు	సీజ్‌చేసిన బియ్యం(క్వింటాళ్లలో)
2021	172	2481.5
2022	125	3931.0
2023	10	96.66



మా భూములు తీసుకొని మాపైనే కేసులు పెడతారా?

- పాశిగామ, స్తంభంపల్లి గ్రామస్తుల ఆగ్రహం
- ఇథనాల్ పరిశ్రమను అడ్డుకుని తీరుతామని శపథం



మాట్లాడుతున్న రెండు గ్రామాల ప్రజలు

వెల్గటూర్(ధర్మపురి): 'ఇథనాల్ రైస్ బ్రాన్ ఆయిల్ పరిశ్రమకు అవసరమైన భూములు మా నుంచి తీసుకుని, మాపైనే కేసులు నమోదు చేస్తున్నారు.. ఇదెక్కడి న్యాయం?' అని పాశిగామ, స్తంభంపల్లి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోటిలింగాలలోని శ్రీకోటేశ్వరస్వామి ఆలయం వద్ద మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో రెండు గ్రామాల ప్రజలు మాట్లాడారు. ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఏప్రిల్ 30న స్తంభంపల్లిలో మైసమ్మతల్లికి మొక్కులు చెల్లించుకునే కార్యక్రమం చేపట్టామన్నారు. అయితే, అక్కడ బందోబస్తులో ఉన్న పోలీసులు.. తమ విధులకు ఆటంకం కలిగించారని, బోనాల ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులుపై దాడిచేశారని, దాడిలో పోలీసులకు గాయాలు అయ్యాయని ఓ మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈమేరకు స్తంభంపల్లి, పాశిగామకు చెందిన 9 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారని అన్నారు. కోటిలింగాల శ్రీకోటేశ్వరస్వామిపై ప్రమాణం చేసి చెబుతున్నామని.. తాము నేరం చేయలేదని, ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామని తెలిపారు. దీంతో తమపై కక్ష కట్టి పోలీసులు అక్రమంగా కేసులు నమోదు చేసి వేధిస్తున్నారని ఆవేదన చెందారు. ఆ రోజు హార్వెస్టర్ కోసం నలుగురం కలిసి వెంకటాపూర్ వెళ్తుండగా పోలీసులు అడ్డుకుని కేసులు నమోదు చేస్తామని బెదిరించారని ఆరోపించారు. దీంతో వెనక్కి వచ్చామని, కానీ, అదేరోజు భారీవర్షం కురిసి తమ పంటలు నీటమునిగాయని ఆవేదన చెందారు. సుమారు రూ.7 లక్షల నష్టం వాటిల్లిందని కన్నీరుమున్నీరయ్యారు. ఆ నష్టానికి సీఐ, ఎస్సైలే బాధ్యులని హెచ్చరించారు. తామేదో ఉగ్రవాదులైనట్లు, దొంగలమైనట్లు వందలాది మంది పోలీసులు తమ గ్రామాల్లో పహారా కాస్తున్నారని మండిపడ్డారు. కనీసం తాము రోజువారీ పనులు కూడా చేయకుండా ఆటంకం కలిగిస్తున్నారని విమర్శించారు. ఆడవాళ్లు నిత్యం భయంతో బతుకీడుస్తున్నారని అన్నారు. పోలీసులను తమ గ్రామాల నుంచి ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమను వెంటనే రద్దు చేయాలని కోరారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

మల్లాపూర్(కోరుట్ల): రైతు సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని ఉమ్మడి కరీంనగర్ డీసీఎంఎస్ చైర్మన్ ఎలాల శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రాల్లో మార్క్‌ఫెడ్, ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. ఈ సీజన్‌లో రైతులు సుమారు 26 వేల టన్నుల మొక్కజొన్న దిగుబడి సాధించే అవకాశం ఉందని తెలిపారు. మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాలు మక్కలకు రూ.1,962 మద్దతు ధర చెల్లించేలా సీఎం కేసీఆర్‌ఆదేశాలు జారీచేశారని చెప్పారు. మార్క్‌ఫెడ్ డీఎం దివ్యభారతి, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాశ్, ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోండి

- జగిత్యాల డీఎం వెంకటనర్సప్ప



మాట్లాడుతున్న డీఎం వెంకటనర్సప్ప

బుగ్గారం(ధర్మపురి): ప్రజలు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల డీఎం వెంకటనర్సప్ప కోరారు. 'ప్రజల వద్దకు ఆర్టీసీ'లో భాగంగా మద్దునూర్, బుగ్గారం గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామపెద్దలతో సమావేశమై ఆర్టీసీలో ప్రయాణికుల సంఖ్య పెంపుపై చర్చించారు. మండల కేంద్రమైన బుగ్గారానికి ప్రత్యేకంగా బస్సు నడిపించాలని గ్రామస్తులు డీఎంకు విన్నవించారు. బుగ్గారం ఎక్స్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. వీటికి సానుకూలంగా స్పందించిన డీఎం.. ప్రయాణికుల కోరిక మేరకు ఎక్స్‌రోడ్డు వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సులను ఆపేలా చర్యలు తీసుకుంటామన్నారు. బుగ్గారానికి ప్రత్యేక బస్సు నడిపించేందుకు సాధ్యాసాధ్యాలపై చర్చిస్తామని డీఎం తెలిపారు. స్థానికుల విన్నపం మేరకు మద్దునూర్ గ్రామంలో పోచమ్మ ఆలయం వరకు బస్సు నడుపుతామని అన్నారు. ప్రయాణికుల సేవకే ఆర్టీసీ అంకితమైఉందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో బుగ్గారం, మద్దునూర్ సర్పంచులు మూల సుమలత, బత్తుల తిరుపతి, వైస్ ఎంపీపీ సుచేందర్, గ్రామస్తులు ముంజాల సత్తయ్య, తూముల మధుకర్, వినయ్, నర్సయ్య, రమేశ్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పుట్లు పండించిన ఊరు.. పస్తులుంటోంది

ఒక ఊరి వ్యథ



ధ్వంసమైన రేకులపల్లి ఎత్తిపోతల

- వర్షాకాలంలో ధ్వంసమైన అరగుండాల ప్రాజెక్టు
- వరదల ఉధృతికి కొట్టుకుపోయిన ఎత్తిపోతల
- మరమ్మతులకు నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు
- వానాకాలం, యాసంగి పంటలు కోల్పోయిన రైతులు



బీళ్లుగా మారిన వ్యవసాయ భూములు

సారంగాపూర్(జగిత్యాల): ఏడాది క్రితం వరకు ఆ గ్రామంలో లక్ష్మీదేవి నడిచినట్లు ఉండేది.. ఎక్కడ చూసినా ధాన్యం రాశులు.. ఎటుచూసినా ప్రజల్లో సుఖసంతోషాలు.. చేతి నిండాపని.. కడుపునిండా తిండి.. వెరసి మంచిజీవితం.. ప్రస్తుతం ఆ గ్రామం రూపురేఖలు మారిపోయాయి.. వరుసగా వానాకాలం, యాసంగి సీజన్లలో పంటలు పండలేదు.. రైతులు, కూలీలు, చిరువ్యాపారుల పరిస్థితి దయనీయంగా మారింది.. ఒకప్పుడు పుట్లు పండించిన గ్రామానికి నేడు పూటగడవడం కూడా కష్టంగా మారింది.. అదే రేకులపల్లి ఊరు.

వ్యవసాయ భూములు 1,400 ఎకరాలు

- బీర్‌పూర్ మండలం రేకులపల్లి గ్రామ పరిధిలో సుమారు 1,400 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి.
- గ్రామ జనాభా 1,565. ప్రతీ కుటుంబానికి వ్యవసాయంతో అనుబంధం ఉంది.
- భూమిలేని వారు కూలీ పనులు చేస్తున్నారు.
- వరి, పత్తి ప్రధాన పంటలు. సుమారు 200 ఎకరాల్లో పత్తి పండిస్తే.. వరి రెండు సీజన్లలో దాదాపు ఐదువేల క్వింటాళ్ల దిగుబడి సాధిస్తున్నారు.

సాగునీటి వనరులు ఇవీ..

రేకులపల్లి గ్రా ఆయకట్టుకు ఎస్సారెస్పీ నుంచి సాగునీరు రావడానికి కాలువల సౌకర్యంలేదు. గోదావరి తీరంలో ఆ ఊరు ఉండడం ఇందుకు కారణం. తీరం వెంట ఎత్తిపోతలు ఏర్పాటు చేసి 100 హెచ్‌పీ సామర్థ్యం గల మూడు విద్యుత్ మోటార్లు, లైన్లు, పైపులైన్లు ఏర్పాటు చేశారకు. పదిచోట్ల పంటలకు సాగునీరు అందించేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించారు. ఊరచెరువుతోపాటు తాళ్లధర్మారంలోని అరగుండాల ప్రాజెక్టులూ అదనపు సాగునీటి వనరులు. ఎత్తిపోతల ద్వారా సుమారు 1,000 ఎకరాలు, చెరువు ద్వారా దాదాపు 50 ఎకరాలు, మరో 350 ఎకరాలకు అరగుండాల ప్రాజెక్టు ద్వారా సాగునీటి సౌకర్యం ఉంది.

అసలేం జరిగింది?

- మొన్నటి వర్షాకాలంలో అరగుండాల ప్రాజెక్టు కట్ట వరద ఉధృతికి కొట్టుకుపోయింది.
- గోదావరి వరద ఉధృతికి ఎత్తిపోతలు నామరూపాల్లేకుండాపోయాయి.
- దీంతో రేకులపల్లి ఆయకట్టుకు వానాకాలం, యాసంగి పంటలకు సాగునీరు అందలేదు.
- ఆ గ్రామంలోని అన్నదాతలు రెండు సీజన్ల పంటలూ పండించలేకపోయారు.
- కేవలం ఊరచెరువు, వ్యవసాయ బావుల కింద 50 – 75 ఎకరాల్లోనే పలు పంటలు వేశారు.
- చాలామంది రైతులు, కూలీలు ఉపాధి కోసం సమీప గ్రామాలకు కూలీ పనుల కోసం వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

11 ఎకరాలు బీళ్లే..



నాకు 15 ఎకరాల వరకు ఉంది. నీటిసౌకర్యంలేక దాదాపు 11 ఎకరాలు బీళ్లుగా ఉన్నాయి. వచ్చే వర్షాకాలం నాటికైనా ఎత్తిపోతలు, అరగుండాలు పూర్తి చేయకపోతే మా ఊరు నుంచి వలసలు తప్పేట్టులేదు. – క్యాతం ప్రభాకర్‌రెడ్డి, రైతు

అరగుండాలు పూర్తిచేయాలి



ఎత్తిపోతలకు రూ.87 లక్షలు, అరగుండాల ప్రాజెక్టుకు ప్రభుత్వం రూ.1.41 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. వర్షాకాలం వరకైనా సాగునీరు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఎలగందుల లక్ష్మి, సర్పంచ్, రేకులపల్లి

రెండు పంటలు పోయినయి



రేకులపల్లిలోని రైతుల నుంచి మా సింగిల్‌విండో ధాన్యం కొనుగోలు చేస్తుంది. ప్రతీ పంటకు వేలాది క్వింటాళ్ల వడ్లు వచ్చేవి. ఎత్తిపోతలు, అరగుండాల నుంచి నీళ్లు రాక రైతులు రెండు పంటలు కోల్పోయారు. – పొల్సాని నవీన్‌రావు, ప్యాక్స్ చైర్మన్, రేకులపల్లి

కర్బూజ పంటకు తీవ్ర నష్టం

- నిండా మునిగిన రైతులు



సిర్‌పూర్‌లో దెబ్బతిన్న మస్క్‌మిలన్

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో కొద్దిరోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో కర్బూజ పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. మరో వారంరోజుల్లో పంట మార్కెట్‌కు తీసుకెళ్లే తరుణంలో భారీవర్షాలు తీవ్రంగా దెబ్బతీశాయి. తమకు పరిహారం చెల్లించాలని కలెక్టర్ యాస్మిన్‌బాషాను మంగళవారం పలువురు బాధిత రైతులు కలిసి విన్నవించారు.

100 ఎకరాల్లో సాగు..

- జిల్లాలో వివిధ రకాలకు చెందిన తర్బూజ సుమారు 100 ఎకరాల్లో సాగుచేశారని అంచనా.
- సారంగాపూర్ మండలం పెంబట్లకు చెందిన బండారి వెంకటేశ్, మల్లాపూర్ మండలం సిర్పూర్‌కు చెందిన నరేశ్, రాయికల్ మండలం అలూరుకు చెందిన రాజిరెడ్డి, ధర్మపురి మండలం తీగలధర్మారానికి వేముల కర్ణాకర్‌రెడ్డి, మెట్‌పల్లి మండలం ముత్యంపేటకు చెందిన శ్రీనివాస్, ధర్మారానికి చెందిన రాజు, మహేశ్ సుమారు 25 ఎకరాల్లో తర్బూజ పండించారు. వీరు కార్పొరేట్ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకోవడంతోపాటు జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల పట్టణాల్లో నేరుగా విక్రయించేందుకు సిద్ధమయ్యారు. అకాల వర్షాలు వారి ఆశలను అడియాసలు చేశాయి. పలు రకాల వాటర్‌మిలన్ విత్తనాలు 50 గ్రాములకు దాదాపు రూ.1600 – రూ.1,800 వరకు ధర ఉంటుంది. ఈలెక్కన ఒక్కో రైతు సుమారు రూ.35 వేల వరకు వెచ్చించి హైదరాబాద్, బెంగళూర్ నుంచి తెప్పించారు.

వర్షాలతో పంట ధ్వంసం

కర్బూజకాయలు తెంపే సమయంలోనే అకాలవర్షాలు కురిశాయి. నేలలో నీళ్లు నిలిచాయి. మొక్క వేరు వ్యవస్థ దెబ్బతిని మొక్కలు వాడిపోయాయి. పూత రాలిపోయింది. కాయలు కుచించుకుపోయాయి. పక్వానికి వచ్చిన కాయల్లో పురుగు చేరింది. రాళ్లవానతో కాయలు పగిలిపోయి. ఒక్కో ఎకరాకి రైతుకు కనీసం రూ.3లక్షల నుంచి రూ.4 లక్షల ఆదాయం వస్తుందనుకుంటే అకాల వర్షం పంటను తుడిచిపెట్టుకుపోయింది.

ఆరు లక్షల నష్టం



కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో రెండెకరాల్లో పండించిన కర్బూజ పంట పూర్తిగా దెబ్బతింది. దాదాపు రూ.5లక్షల నుంచి రూ.6 లక్షల వరకు నష్టం వాటిల్లింది. సర్కార్ ఆదుకోవాలె.

– బండారి వెంకటేశ్, రైతు, పెంబట్ల

కార్పొరేట్ సంస్థతో ఒప్పందం



మస్క్‌మిలన్, కర్బూజ కాయలు అమ్మేందుకు ఓ కార్పొరేట్ సంస్థతో ఒప్పందం చేసుకున్న. రెండు రోజుల్లో కాయలు తెంపుదామనుకున్న. వర్షంతో పంటంతా దెబ్బతిని ఆరులక్షల నష్టం వచ్చింది. – నరేశ్, రైతు సిర్‌పూర్

కాయలు పగిలిపోయినయి



రాళ్లవానతో కర్బూజకాయలు పగిలిపోయినయి. ఫిబ్రవరి నుంచి పంటను కాపాడుకుంటున్న. భారీవానలు పంటను పూర్తిగా దెబ్బతీసినయి. ప్రభుత్వమే ఆదుకోవాలె.

– శ్రీనివాస్, రైతు, ముత్యంపేట

క్లుప్తంగా

నృసింహుని సేవలో ఎస్పీ కుటుంబం



దేవస్థానంలో ఎస్పీ భాస్కర్, కుటుంబసభ్యులు

ధర్మపురి: స్థానిక శ్రీలక్ష్మీనృసింహస్వామి వారిని ఎస్పీ భాస్కర్ దంపతులు, కుటుంబసభ్యులు మంగళవారం దర్శించుకున్నారు. అర్చకులు వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం రెనోవేషన్ కమిటీ సభ్యుడు రామన్న, ఈవో శ్రీనివాస్ వారికి స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలతోపాటు ఫొటో అందజేశారు. కార్యక్రమంలో వేదపండితుడు బొజ్జ రమేశ్‌శర్మ, ఎస్సై కిరణ్‌కుమార్, కమిటీ సభ్యులు గునిశెట్టి రవీందర్, గందె పద్మ, వేముల నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న జడ్జికి సన్మానం



జడ్జి నిహారికతో బార్ అసోసియేషన్ సభ్యులు

కోరుట్ల: కోరుట్ల జూనియర్ సివిల్ జడ్జిగా పని చేసి, బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తి నిహారికను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఆమె సేవలను న్యాయవాదులు కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బద్ది నర్సయ్య, ఉపాధ్యక్షుడు కొంపెల్లి సురేశ్, ప్రధాన కార్యదర్శి బైరి విజయ్, ట్రెజరర్ రాజశేఖర్, న్యాయవాదులు చాప వందన, సదుల మాధురి, విజయ్ సాయి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన వెంకటరమణ ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. గత నెల 20న ఇంటి ఎదుట పార్కింగ్ చేసి, మరుసటిరోజు ఉదయం చూసేసరికి బైక్ కనిపించలేదని బాధితుడు తెలిపారు. అతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై సంజీవ్ మంగళవారం తెలిపారు.

బొలెరో యజమానిపై కేసు

- గత నెల 30న ఆర్టీసీ బస్సును ఢీకొన్న వాహనం

మల్యాల(చొప్పదండి): ఆర్టీసీ బస్సును ఓ బొలెరో ఢీకొన్న ఘటనలో సదరు వాహన యజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మల్యాల ఎస్సై చిరంజీవి కథనం ప్రకారం.. నర్సంపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గత నెల 30న నిజామాబాద్ నుంచి నర్సంపేట వెళ్తోంది. అదే సమయంలో కరీంనగర్‌కు చెందిన రవి తన బొలెరో వాహనంలో కరీంనగర్ నుంచి జగిత్యాల వెళ్తున్నాడు. మల్యాల మండలం ముత్యంపేట శివారులోని దిగువ కొండగట్టు వద్ద ముందు వెళ్తున్న కారును ఓవర్ టేక్ చేయబోయి, ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బస్సులోని ఓ ప్రయాణికురాలు తీవ్రంగా గాయపడింది. అతివేగంగా, అజాగ్రత్తగా వాహనం నడిపి, ప్రమాదానికి కారణమైన రవిపై ఆర్టీసీ బస్సు కండక్టర్ బాబురావు, డ్రైవర్ జితేందర్‌ల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ మళ్లీ షురూ

- మున్సిపాలిటీలకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు
- అర్జీదారులకు ఫోన్ చేస్తున్న అధికారులు
- జిల్లాలో ఇప్పటివరకు 40 దరఖాస్తులకు పరిష్కారం
- అంతా సజావుగా సాగితే రూ.10 కోట్ల వరకు ఆదాయం వచ్చే అవకాశం

మున్సిపాలిటీల్లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులు

జగిత్యాల	8,011
కోరుట్ల	9,200
మెట్‌పల్లి	5,871
రాయికల్	978



జగిత్యాల మున్సిపల్ కార్యాలయం

జగిత్యాల: జిల్లాలో క్రమబద్ధీకరణ ప్రక్రియ మళ్లీ షురూ అయింది. లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) చేపట్టాలని ప్రభుత్వం మున్సిపాలిటీలకు ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. జగిత్యాల జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు ఉన్నాయి.

2020 ఆగస్టులో పథకం..

అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం 2020 ఆగస్టులో ఎల్‌ఆర్‌ఎస్‌ను తీసుకువచ్చింది. అప్పుడు అందరూ రూ.1,000 ఫీజు చెల్లించి, దరఖాస్తు చేసుకున్నారు. కానీ అప్పటి నుంచి ఆ డబ్బులు బల్దియాలోనే ఉన్నాయి. వారి భూములను క్రమబద్ధీకరించాలని సర్కారు ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు జాబితా తీసుకొని, సంబంధిత వ్యక్తులకు ఫోన్ చేస్తూ చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో ఇప్పటివరకు 40 దరఖాస్తులను పరిష్కరించినట్లు అధికారులు తెలిపారు.

చాలామంది ప్లాట్లు విక్రయించారు..

మున్సిపాలిటీల్లో దరఖాస్తు చేసుకున్న చాలామంది తమ ప్లాట్లు విక్రయించుకున్నారు. దీంతో అవి కొనుగోలు చేసినవారి పేరిట రిజిస్ట్రేషన్ అయ్యాయి. ఈ క్రమంలో దరఖాస్తు చేసుకున్న వారి పేరు, స్థలం మరొకరి పేరిట ఉండటంతో మున్సిపల్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

రూ.20 వేల నుంచి రూ.30 వేలు చెల్లించాలి

ఒక ప్లాట్‌కు గత మార్కెట్ ధరకు అనుగుణంగానే రూ.20 వేల నుంచి రూ.30 వేలు చెల్లించాల్సి ఉంటుంది. అయినా ఎక్కువ మొత్తం కావడంతో కొందరు విముఖత చూపుతున్నట్లు తెలిసింది. కానీ చెల్లించలేకపోతే ముమ్ముందు ఇప్పటి మార్కెట్ ప్రకారమే కట్టాల్సి ఉంటుంది. కచ్చితంగా ఎల్‌ఆర్‌ఎస్ కట్టుకోవాలని అధికారులు అంటున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ సజావుగా సాగితే జిల్లాలోని మున్సిపాలిటీలకు రూ.10 కోట్ల వరకు ఆదాయం లభించనుంది.

దరఖాస్తులు పరిశీలిస్తున్నాం

ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. దరఖాస్తులను పరిశీలిస్తున్నాం. అన్నీ సక్రమంగా ఉంటేనే ఆమోదిస్తాం. కొద్దిరోజుల్లోనే అన్నింటికీ మోక్షం లభిస్తుంది. - శ్రీనివాస్, టీపీవో

అక్రమ లేఅవుట్లే..

జిల్లా అంతటా స్థిరాస్తి వ్యాపారులు అనుమతులు లేకుండానే ప్లాట్లు చేస్తూ విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాలంటే మౌలిక వసతులు కల్పించాల్సి ఉంటుంది. తాగునీరు, విద్యుత్, రోడ్లు, మురికి కాలువల నిర్మాణం వంటివి చేయాల్సి ఉంటుంది. ఇలాంటివేవీ లేకుండానే జగిత్యాలలో అనేక ప్లాట్లు వెలిశాయి. వీరిలోనూ ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారున్నారు. ఎకరం నుంచి రెండెకరాలుండి, ప్లాట్లు చేసినవారికి క్రమబద్ధీకరించుకోవడానికి అవకాశం లేదు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



ఎల్లాపూర్ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న లక్ష్మణ్‌కుమార్, నాయకులు

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

పెగడపల్లి(ధర్మపురి): ధాన్యం తూకం వేయడంలో జాప్యం జరిగి, అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసిందని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. తూకంలో ఎటువంటి కోత విధించకుండా తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పెగడపల్లి మండలంలోని ఎల్లాపూర్, రాజారాంపల్లి గ్రామాల్లోని ఐకేపీ కొనుగోలు కేంద్రాలను స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించి, రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసి, మొలకెత్తిందని పేర్కొన్నారు. తప్ప, తాలు పేరిట అడ్డగోలుగా కోత విధిస్తూ రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎటువంటి షరతులు లేకుండా తూకం వేసేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సందె మల్లారెడ్డి, రాచకొండ రాజశేఖర్, రంగు మహేందర్, రంగు శేఖర్, రంగు స్వామి, ఆరెల్లి లచ్చయ్య, మోదంపెల్లి అంజయ్య, కోట సతీశ్, అంజయ్య, యువజన కాంగ్రెస్ పార్టీ వెల్గటూరు మండల అధ్యక్షుడు రమేశ్, ధర్మపురి మండల అధ్యక్షుడు రాందేని మొగిలి పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలి

ధర్మపురి: గ్రామ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ధర్మపురిలో కార్యదర్శులు చేపడుతున్న నిరవధిక సమ్మె మంగళవారం 5వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన వారికి మద్దతు తెలిపారు. జీపీ కార్యదర్శులు నాలుగేళ్ల కాంట్రాక్టు పద్ధతిలో కొనసాగారని, వారిని ఎందుకు రెగ్యులరైజ్ చేయడం లేదో చెప్పాలన్నారు. బీజేపీ ధర్మపురి అసెంబ్లీ కన్వీనర్ కస్తూరి సత్యం, జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం తదితరులు జీపీ కార్యదర్శులకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్.దినేశ్, సింహరాజు ప్రసాద్, వేముల రాజు, రాందేని మొగిలి, చిలుముల లక్ష్మణ్, బీజేపీ నాయకులు సంగెపు గంగారాం, బెజ్జారపు లవన్‌కుమార్, ఓరుగంటి చంద్రశేఖర్, బండారు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీపై ఉన్న శ్రద్ధ రైతులపై ఏదీ?

వెల్గటూర్(ధర్మపురి): మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు ఇథనాల్ పరిశ్రమపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆరోపించారు. వెల్గటూర్ మండలంలోని పాశిగామ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాలకు నష్టం వాటిల్లిన పంటలను పరిశీలించే సమయం మంత్రికి లేదని, 20 రోజుల క్రితం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువస్తే తూకం వేయడం లేదని విమర్శించారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని, తేమ, తప్ప, తాలు పేరిట మిల్లర్లు కొర్రీలు పెట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే రైతుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ వెల్గటూర్ మండల అధ్యక్షుడు పూదరి రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- 14 నెలల క్రితమే వివాహం
- జగిత్యాల పట్టణంలో విషాదం



శైలేందర్ (ఫైల్)

జగిత్యాల క్రైం/మల్యాల(చొప్పదండి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. మల్యాల ఎస్సై మంద చిరంజీవి కథనం ప్రకారం.. జగిత్యాల విద్యానగర్‌కు చెందిన శైలేందర్(33) పట్టణంలో హోటల్ నిర్వహిస్తాడు. సోమవారం సాయంత్రం హోటల్ మూసివేసి, పని నిమిత్తం బైక్‌పై మల్యాలకు వెళ్లి, తిరిగి ఇంటికి వస్తున్నాడు. నూకపల్లి వీఆర్‌కే కళాశాల వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి కోరుట్ల మండలం జోగిన్‌పల్లికి చెందిన యువతితో 14 నెలల క్రితమే వివాహమైంది. శైలేందర్ మృతితో ఇరు కుటుంబాలవారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనతో జగిత్యాల పట్టణంలో విషాదం నెలకొంది. మృతుడి తండ్రి గంగారాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్య



సరోజన (ఫైల్)

జగిత్యాల క్రైం: జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన బొద్దుల సరోజన ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సరోజన గత 13 ఏళ్లుగా కీళ్ల వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమైంది. కుటుంబసభ్యులు పలు ఆసుపత్రుల్లో చూపించినా నయం కాలేదు. దీంతో ఆమె మనస్తాపానికి గురైంది. మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో కిరోసిన్ పోసుకొని, నిప్పంటించుకుంది. మృతురాలి భర్త గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

అత్తింటివారిపై కట్నం వేధింపుల కేసు

జగిత్యాలక్రైం: అదనపు వరకట్నం కోసం ఓ వివాహితను వేధించిన ఆమె అత్తింటివారిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై సంజీవ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని సాయిరాంనగర్‌కు చెందిన వర్షిణికి జిల్లా కేంద్రానికే చెందిన రంజిత్‌తో మూడేళ్ల క్రితం వివాహం జరిపించారు. పెళ్లి సమయంలో రూ.10 లక్షలు, 3 తులాల బంగారం కట్నంగా ఇచ్చారు. ఈ క్రమంలో కొంతకాలంగా వర్షిణిని ఆమె భర్త రంజిత్, మామ గంగాధర్, అత్త స్వరూపలు అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. దీంతో బాధితురాలు మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రేడియాలజీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్ కింద ఇటీవల ఏర్పాటు చేసిన రేడియోలజీ విభాగంలో కాంట్రాక్టు ప్రాతిపదికన రేడియాలజిస్ట్–1, రేడియోగ్రాఫర్–1 పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జగిత్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ రాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

వేసవి శిక్షణ శిబిరాలపై ఆసక్తి

- ఉత్సాహంగా నృత్యం నేర్చుకుంటున్న విద్యార్థులు
- సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో వేసవి శిబిరం
- నేడు కూడా శిక్షణ కొనసాగింపు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

జగిత్యాలజోన్: వేసవి సెలవులు వచ్చిందంటే గతంలో అమ్మమ్మ, నానమ్మ, తాతయ్య ఊళ్లకు వెళ్లే చిన్నారులు.. వారు చెప్పే కథలు వింటూ కాలక్షేపం చేసేవారు. ప్రస్తుతం తల్లితండ్రులు సహా అందరూ తమతమ పనుల్లో బిజీగా మారిపోయారు. తమ బంధువుల ఇళ్లకు తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులకు సమయం కుదరడంలేదు. అమ్మమ్మ, తాతయ్యలకూ ఓపికలేదు. ఈ నేపథ్యంలో విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా సాక్షి మీడియా గ్రూప్, కిడ్జీ రూట్స్ పాఠశాల ఆధ్వర్యంలో వివిధ అంశాలపై నిష్ణాతులతో శిక్షణ ఇప్పిస్తున్నారు. సోమవారం మెదడుకు పనిచెప్పే చదరంగంపై తర్ఫీదు ఇవ్వగా, మంగళవారం డాన్స్ ప్రాక్టీస్ చేయించారు.

డ్యాన్స్‌తో విద్యార్థులకు ఉల్లాసం

- నృత్యం నేర్చుకునేందుకు విద్యార్థులు పోటీపడ్డారు. నర్సరీ నుంచి పదో తరగతి చదివే విద్యార్థులకు సినిమాల్లోని పాటలపై స్టెప్పులు వేయించారు. ఇందులోని మెలకువలను నేర్పించారు.
- విద్యార్థులు కూడా తమకు ఇష్టమైన పాటలపైన డ్యాన్స్ చేసేందుకు ఆసక్తి చూపారు. సినిమాలే కాదు.. జానపద నృత్యాలు, డీజే సాంగ్స్ పాటలు, పాశ్చాత్య సంస్కృతిని ప్రతిబింబించే పాటలపై డ్యాన్స్ చేసి ఆకట్టుకున్నారు.
- నృత్యంతో శరీరంలోని ప్రతీ అవయం కదిలే తీరు, దాంతో ఉపయోగాల గురించి డ్యాన్స్ మాస్టర్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సాక్షి జిల్లా ఇన్‌చార్జి కందూకూరి శశిధర్, క్రైం రిపోర్టర్ గూడ మల్లారెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ జిల్లా ఉమాకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్యాన్స్ అంటే ఇష్టం



సమ్మర్ క్యాంప్‌లో డాన్స్ నేర్చుకున్న. సినిమా పాటలు అంటే నాకు ఎంతోఇష్టం. పాటలు పెట్టుకుని స్టెప్పులు వేయడం నేర్చుకుంటున్న. ఇంకో పది రోజులైతే డాన్స్ బాగా నేర్చుకుంట. - వైదిక్రం, విద్యార్థి

రిలాక్స్‌గా ఉంది



ఇంటి దగ్గర టీవీలు, సెల్ ఫోన్లలో వచ్చే పాటలపై అప్పుడప్పుడు డ్యాన్స్ చేస్తుండేదానిని. ఇప్పుడు పాటలపై డ్యాన్స్ నేర్చుకుంటున్న. స్టెప్పులు కఠినంగా ఉన్నా.. ఎక్కువ సార్లు ప్రాక్టీస్ చేస్తున్న. - మనస్విని, విద్యార్థిని

ఉత్సాహం చూపిస్తున్నారు



'సాక్షి' చేపట్టిన వేసవి శిక్షణ శిబిరానికి వచ్చేందుకు విద్యార్థులు ఉత్సాహం చూపిస్తున్నారు. మనకు నచ్చిన పాటలపై కాకుండా, విద్యార్థులకు నచ్చిన పాటలపైనే నేను వారికి డ్యాన్స్ నేర్పిస్తున్నాను. - కవిత పాశ్వాన్, డ్యాన్స్ మాస్టర్

భూ క్రమబద్ధీకరణ గడువు పొడిగింపు



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్ బాషా

జగిత్యాల: జీవో నం.58, 59 కింద భూ క్రమబద్ధీకరణకు దరఖాస్తు గడువును ఈ నెల 31 వరకు పొడిగించినట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ, యూఎల్‌సీ భూములు, కార్పొరేట్ సంస్థల ఆధీనంలో ఉన్న అసైన్‌మెంట్ రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ తీగలు తెగితే సమాచారం ఇవ్వండి



సూచనలిస్తున్న డీఈ మారుతి

కథలాపూర్: గ్రామాల్లో అనుకోకుండా విద్యుత్ తీగలు తెగిపడితే ట్రాన్స్‌కో సిబ్బందికి సమాచారం ఇవ్వాలని డీఈ మారుతి, ఏడీఈ రాజబ్రహ్మచారి కోరారు. మంగళవారం కథలాపూర్‌లో విద్యుత్ భద్రత వారోత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఇంట్లో విద్యుత్ సమస్యలు వస్తే అనుభవజ్ఞులతో రిపేర్ చేయించుకోవాలని చెప్పారు. స్థానికులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఈలు జమీల్ పాషా, రాకేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓంకార్ జీవితం ఉద్యమకారులకు ఆదర్శం

- జనశక్తి రాష్ట్ర మాజీ నేత కూర రాజన్న



బాధితులను పరామర్శిస్తున్న కూర రాజన్న

జగిత్యాలజోన్: ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ఓంకార్ జీవితం నేటి ఉద్యమకారులకు ఆదర్శమని జనశక్తి రాష్ట్ర మాజీ నేత కూర రాజన్న అన్నారు. ఓంకార్ సోమవారం గుండెపోటుతో మృతిచెందారు. మంగళవారం జగిత్యాలలో అంత్యక్రియలు నిర్వహించగా రాజన్న హాజరయ్యారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆడంబరాలకు పోకుండా, నిజాయితీగా, సాదాసీదా జీవనం గడిపిన వ్యక్తి ఓంకార్ అని కొనియాడారు. విద్యార్థుల సమస్యలపై ఎప్పుడూ గళమెత్తేవాడని గుర్తు చేశారు. ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ముద్దం ప్రభాకర్, న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకులు జీవీ.చలపతిరావు, విమల, సంధ్య, ప్రదీప్, బీజేపీ నాయకుడు పడాల తిరుపతి తదితరులున్నారు.

కారు ఢీకొని యువకుడి మృతి

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధి రేకుర్తి ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజన్న సిరిసిల్ల జిల్లా చీర్లవంచ ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన యువకుడు మృతి చెందాడు. ఎస్సై ఎల్లయ్యగౌడ్ వివరాలు.. చీర్లవంచ ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన బొల్ల ప్రశాంత్(28) రామగుండం రిలయన్స్ ట్రెండ్స్‌లో ఉద్యోగం చేసుకుంటూ కరీంనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఉద్యోగ నిమిత్తం రోజూ కరీంనగర్ నుంచి రామగుండంకు ప్రయాణిస్తుండేవాడు. సోమవారం రాత్రి స్నేహితుల వద్దకు తన పల్సర్ వాహనంపై వెళ్తున్న క్రమంలో కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిపై రేకుర్తిలోని అంబేద్కర్ విగ్రహం సమీపంలో కారు వెనక నుంచి ఢీకొట్టింది. ఈప్రమాదంలో ప్రశాంత్‌కు తీవ్ర గాయాలై రోడ్డుపై పడిపోయాడు. గమనించిన ప్రయాణికులు, స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు 108కు ఫోన్ చేశారు. అంబులెన్స్‌లో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి కనకయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

జమ్మికుంట(హుజూరాబాద్): ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని వావిలాల గ్రామానికి చెందిన సూదుల సంపత్(57) సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంటి పక్కన వారు మంగళవారం చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య సమ్మక్క మానసికంగా అనారోగ్యానికి గురైందని, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు తాళలేక మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. కుమారుడు అనురాజ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రమేశ్ తెలిపారు.

ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలి బైఠాయింపు

పెద్దపల్లిరూరల్: ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించాడంటూ ఓ యువతి తన ప్రియుడు కలవేన రాజ్‌కుమార్ ఇంటి ముందు బైఠాయించిన ఘటన పెద్దపల్లి మండలం హనుమంతునిపేటలో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. హనుమంతునిపేట గ్రామానికి చెందిన రాజ్‌కుమార్, ఓ యువతి కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించిన రాజ్‌కుమార్ ఇప్పుడు ముఖం చాటేశాడు. దీంతో బాధితురాలు తన కుటుంబీకులతో వచ్చి రాజ్‌కుమార్ ఇంటి ముందు బైఠాయించింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ సదయ్య, గ్రామ పెద్దలు బుధవారం మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇవ్వడంతో ఆమె తన కుటుంబీకులతో కలిసి ఇంటికి వెళ్లిపోయింది. కాగా రాజ్‌కుమార్‌తో మాట్లాడి, పెళ్లికి ఒప్పించేందుకు సర్పంచ్ సహా పెద్దలు ప్రయత్నిస్తున్నారు.

కారు, ఆటో ఢీకొని ఒకరి మృతి

- మరో 8 మందికి తీవ్ర గాయాలు
- పెండ్లి వేడుకలకు వస్తూ ప్రమాదానికి గురైన కుటుంబం



ప్రమాద స్థలంలో నుజ్జునుజ్జయిన ఆటో



గాయపడిన రక్షిత, సాత్విక్ (అక్కాతమ్ముడు)



అశోక్, రజితలను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

కమాన్‌పూర్(మంథని): మండలంలోని గుండారం గ్రామం వద్ద పెద్దపల్లి– మంథని ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా 8 మందికి గాయాలైనాయి. పోలీసుల వివరాలు.. సిద్దిపేట జిల్లా కేంద్రానికి చెందిన తంతనపల్లి అశోక్(40) సొంత ఆటోలో అతడి భార్య రజిత, పిల్లలు రక్షిత, సాత్విక్‌తో కలిసి కమాన్‌పూర్ మండలం జూలపల్లి గ్రామంలో జరిగే వివాహ వేడుకలకు వస్తున్నారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌కు చెందిన బంధువులు సుజాత, రాహుల్‌ను ఆటోలో వారి వెంట తీసుకువస్తున్నారు. కమాన్‌పూర్ మండలం గుండారం రాజేంద్రనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దకు రాగానే మంథని నుంచి వస్తున్న కారు, ఆటో ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఆటో రోడ్డుపై బోల్తా పడగా, కారు రోడ్డు పక్కన చెట్లలోకి దూసుకెళ్లింది. ఆటో నడపుతున్న అశోక్, అందులో ఉన్న రజిత, రక్షిత, సాత్విక్, సుజాత, రాహుల్‌కు తీవ్రగాయాలు కాగా, కారులో ఉన్న ఉదయ్, ఆగయ్య, రాధకు స్వల్ప గాయాలైనాయి. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై షేక్‌మస్తాన్ క్షతగాత్రులను ఆటోలో పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రగాయాలైన అశోక్, రజిత, రక్షిత, సాత్విక్, సుజాత, రాహుల్‌ను కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ అశోక్ మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు.